
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
సోమవారం 20 జనవరి 2025



న్యూస్ బాక్స్

క్రీడలతో మానసికోల్లాసం

ఇల్లంతకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్, ప్రెస్‌క్లబ్ మధ్య స్నేహ పూర్వక క్రికెట్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం పనిచేసే వారికి ఇలాంటి పోటీలతో ఉత్సాహం పెరుగుతుందన్నారు.ఉమ్మడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తూముకుంట శ్రీనివాస్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్, ఐజేయూ అధ్యక్షుడు మారుపాక అనీల్‌కుమార్, పోలీస్‌సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

గంభీరావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కాలనీలో మండల ఒడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల బాబు స్థానిక యూత్ సభ్యులకు ఆదివారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నారు.

గొల్లపల్లిలో వైద్యశిబిరం

ఎల్లారెడ్డిపేట, జనవరి19(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని జయ ఆసుపత్రిలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు సాధన, మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలోని సుమారు 50 మందికి ఆర్థో, ఈఎన్‌టీతో ఇతర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు జయ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లకు కసరత్తు



- వంద శాతం లక్ష్యం దిశగా ప్రణాళిక
- 70 రోజులు గడువు
- సిరిసిల్ల, వేములవాడ బల్దియాల్లో అధికారుల దృష్టి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

బల్దియాల అభివృద్ధికి ఆస్తి పన్నుల చెల్లింపు ఊరటను ఇస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు, ఇతర పన్నుల వసూళ్లకు మరో 70 రోజులు మాత్రమే మిగిలింది. ఈ ఆర్థిక సంవత్సరం 31వ తేదీలోగా వంద శాతం పన్నుల వసూలు పూర్తి చేసి రాష్ట్రంలో మరోసారి ముందు వరుసలో నిలవడానికి జిల్లాలోని సిరిసిల్ల వేములవాడ మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సిరిసిల్ల వేములవాడ మున్సిపాలిటీలు ఆస్తిపన్ను వసూళ్లలో ఏటా ముందంజలో ఉంటున్నారు. అదే ఆనవాయితీ కొనసాగించాలని అధికారులు కసరత్తు ప్రారంభించారు.

మున్సిపాలిటీల్లో వసూళ్ల లక్ష్యం రూ.10.32 కోట్లు

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ బకాయిలు మినహాయిస్తే ప్రైవేటు ఆస్తి పన్నులకు సంబంధించి రూ.10.32 కోట్లు లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటి వరకు రూ.6.22 కోట్లు వసూలు చేశారు. మిగిలిన బకాయిలు రూ.4.09 కోట్లు వసూలు చేస్తున్నారు. సిరిసిల్ల పరిధిలో 23,467 గృహాలు ఉండగా ఇందులో కమర్షియల్ రెసిడెన్షియల్ 2785, కమర్షియల్ 2566, గృహాలు 18,116 ఉన్నాయి. మొత్తం 23,467 గృహాలకు సంబంధించి రూ.6.22 కోట్లు ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. ఇందులో రూ.13.07 లక్షలు పాత బకాయిలు ఉన్నాయి. పాత బకాయిలుపై రూ.4.23 లక్షల జరిమానా విధించారు. ఇప్పటి వరకు రూ.3.78 కోట్లు వసూలు చేశారు. ఇందులో పాత బకాయిలు రూ.5.55 లక్షలు, పెనాల్టీకి సంబంధించి రూ.45 వేలు వసూలు చేశారు. మార్చి 31 వరకు రూ.2.44 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇందులో పాత బకాయిలు రూ.7.52 లక్షలు ఉన్నాయి. ఇప్పటి వరకు 60.75 శాతం వసూలు చేశారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో 14,477 గృహాలు ఉండగా గృహాలు 11,153, కమర్షియల్ 2292, కమర్షియల్, గృహాలు కలిపి 1032 ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.4.09 కోట్లు వసూలు..

మిగతా 8లో

మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు

- వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి



వేములవాడ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 25వ తేదీ నుంచి 27వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. భక్తులకు సులువుగా దర్శనం కల్పించేందుకు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై శనివారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మహాశివరాత్రి జాతరకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

ఆలయ ఈవో : మహాశివరాత్రి జాతరకు నాలుగు లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ఆయా శాఖల అధికారులు సిబ్బందికి దిశా, నిర్దేశం చేశాం. క్యూలైన్‌లు, చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ, ఉదయం ఉచితంగా అల్పాహారం అందజేత వంటి చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నారా?

ఆలయ ఈవో : తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయ పార్కింగ్ వరకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. 14 ఉచిత బస్సులు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఆలయ పరిసరాలు, వసతి గదుల్లో పారిశుధ్యం కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

ఆలయ ఈవో : మహాశివరాత్రి జాతరకు 1500 మంది కార్మికులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తారు. అదనంగా మున్సిపల్ ఆధ్వర్యంలో 600 మంది కార్మికులు పట్టణంలో పారిశుధ్య పనులు చూస్తారు. ఇతర దేవాలయాల సిబ్బందిని డిప్యూటేషన్‌పై అదనంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : భక్తులకు ఎన్ని వసతి గదులు అందుబాటులో ఉన్నాయి?

ఆలయ ఈవో : మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు 200 వసతిగదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పట్టణంలోని దేవాలయ లక్ష్మీగణపతి, పార్వతీపురం వసతి గదులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : గతం కంటే ఈసారి అదనంగా ఎలాంటి ఏర్పాట్లు చేపడుతున్నారు?

ఆలయ ఈవో : భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించాం. అదనంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ధర్మగుండంతోపాటు ఇతర ప్రాంతాల్లో వీలైనన్ని చోట్ల స్ప్రింక్లర్లు అందుబాటులో ఉంటాయి, కల్యాణకట్టలో అదనంగా నాయీబ్రాహ్మణులు ఉంటారు. భక్తులకు తాత్కాలికంగా మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యానికి చర్యలు తీసుకుంటున్నాం.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- రైతు భరోసా సర్వే పరిశీలన

8

కొనసాగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

6


వీణ కచేరీ నిర్వహిస్తున్న సభ్యులు

యువత క్రీడా స్ఫూర్తిని చాటాలి


ట్రోఫీ అందజేస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడా స్ఫూర్తిని చాటాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్థానిక స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహ భావం పెంపొందుతుందన్నారు. ఆటలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎస్సై రమాకాంత్ పాల్గొన్నారు.

ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ


భూమిపూజ చేస్తున్న నాయకులు

గంభీరావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌లో ఆదివారం స్వాతంత్ర్య యోధుడు ఒడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు వడ్డెర సంఘం నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓబన్న త్యాగాలు, సేవలను మరువబోమన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు పిట్ల బాబు, వడ్డెర సంఘం నాయకులు నర్సయ్య, లక్ష్మణ్, వెంకటి, ఎర్రయ్య, శ్రీనివాస్, వెంకటేష్, మైసయ్య, నాగయ్య, రాములు నారాయణ తదితరులు ఉన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించ తలపెట్టిన 'వేల గొంతులు, లక్ష డప్పులు' సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా డప్పు కళాకారుడు రమేశ్ పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో స్థానిక డప్పు కళాకారులతో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ డప్పు కళాకారుల సంక్షేమం కోసం పోరాడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, సామ్యూల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా అర్హుల గుర్తింపు సర్వే : కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ కోసం అర్హుల గుర్తింపు సర్వే పక్కాగా చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికీ కార్డులు లేని వారు దరఖాస్తులు అందజేయవచ్చని సూచించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని, కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేస్తారని, అపోహలు అవసరం లేదని అన్నారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని, దరఖాస్తు చేసుకోని అందజేయాలని, సర్వే చేసి అర్హులకు మంజూరు చేస్తామని అన్నారు. ఇళ్ల పంపిణీలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు.

వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించాలి

జిల్లాలో వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా అందుతుందన్నారు. నాలా భూముల కన్వర్షన్ వివరాలు పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అర్హులకు అందేలా చూస్తామని, దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను గ్రామసభల్లో చర్చిస్తామని, కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, సీపీవో శ్రీనివాసాచారి, జిల్లావ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, ఎస్‌డీసీ రాధాబాయి, జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మీ, మైనింగ్ ఏడీ క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- కొనసాగుతున్న రోడ్డు భద్రతావారోత్సవాలు


హెల్మెట్ వినియోగంపై ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీస్ అధికారులు

సిరిసిల్ల క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ద్విచక్ర వాహనదారుడు స్వీయ రక్షణతోపాటు కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ ధరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ట్రాఫిక్-రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. వాహనదారులు చేసే చిన్నచిన్న తప్పిదాలతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి వాహనాలను నడపడంతో రోడ్డు ప్రమాదాల జరిగి కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. వాహనదారుడు క్రమశిక్షణతో వాహనలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు కృష్ణ, వీరప్రసాద్, ఆర్ఐ రమేష్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

మిడ్ మానేరులో ఎస్పీ సందడి


ప్రాజెక్ట్ నీటిలో కయాక్‌పై ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కయాక్(బోటు)పై రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ సందడి చేశారు. ఆదివారం జిల్లాలోని బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ నీటిలో దత్తాత్రేయ దేవాలయ సమీపంలో కయాకింగ్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. టూరిస్టు శాఖకు సంబంధించిన కయాక్‌పై జలాశయంలో ఎస్పీ సరదాగా గడిపారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఆదివారం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి మహాసభలు ప్రారంభం అవుతాయన్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న సీపీఎంకు అండగా నిలువాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేపడుతామని అన్నారు.నాయకులు సావనపెల్లి రాములు, మంద అనీల్‌కుమార్, గరిగె రవి, మచ్చ స్వామి, శ్రీశైలం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం సనుగులలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సనుగుల ఆధ్వర్యంలో నిర్మించిన కార్యాలయ భవనం, స్టోరేజ్ గది, రామారావుపల్లిలో ఎరువుల గోదామును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులకు అనేక సేవలు అందిస్తున్నాయన్నారు. గతంలో నష్టాల్లో ఉన్న సహకార సంఘాలు నేడు వాణిజ్య బ్యాంకులతో పోటీపడి రుణాలు ఇచ్చే స్థాయికి ఎదిగాయన్నారు. గతంలో చందుర్తి, రుద్రంగి నాగారం, జోగాపూర్ చెరువులను పూర్తి చేసుకున్నామని, మళ్లీ ప్రజా ప్రభుత్వంలో మర్రిపెల్లి, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఎర్ర చెరువు, పటేల్ చెరువులను గోదావరి జలాలతో నింపే ప్రక్రియ చేపట్టనున్నట్లు చెప్పారు. ఆశిరెడ్డిపల్లెలో కొత్త చెరువు నీటితో నింపుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మన ప్రాంతంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా అమలు చేయనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల్లో పేరు లేని వారు ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభల్లో నమోదు చేసుకోవాలన్నారు. సనుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జలగం కిషన్ రావు, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ చెలకల తిరుపతి, నారాయణ రెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, డాక్టర్ ఆనందరెడ్డి, కేడీసీసీ మేనేజర్లు రమేష్, అజయ్, సీఈవో శ్రీవర్ధన్, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశం, మెడిదుల గోపాల్, డైరెక్టర్లు చింతపటి రామస్వామి, కేసిరెడ్డి నర్సారెడ్డి, నల్లా నాగిరెడ్డి, శంకరయ్య, పూల్‌సింగ్, అజయ్ రెడ్డి, గోపాల్, లక్ష్మి, నాయకులు ముస్కు ముకుంద రెడ్డి, ఎర్రం గంగా నర్సయ్య, ధర్మపురి శ్రీనివాస్, ముస్కు పద్మ-మల్లారెడ్డి,లచ్చిరెడ్డి, కరీం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి యువకుడి మృతి


నరేష్ మృతదేహం

ఇల్లందకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి డ్రైనేజీలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం ఇందిరానగర్‌కు చెందిన సకినాల నరేష్ (30) తన అత్తగారి ఊరైనా పాతర్లపల్లి గ్రామానికి చెందిన తన బాబాయి కొడం జయపాల్‌తో కలిసి ఇల్లందకుంట నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లందకుంట ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో బైక్ అదుపు తప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. తీవ్ర గాయాలతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. జయపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కోరుట్ల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. కోరుట్ల పట్టణానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాద వివరాలను గ్రామస్థులు, పోలీసులు తె లిపారు. నిజామాబాదు జిల్లా కేంద్రంలోని పెంటర్‌నగర్ చెందిన షేక్ రశీద్ (25) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై కోరుట్ల పట్టణంలోని బీముని దుబ్బ ప్రాంతంలోని తన అక్కను కలిసి జగిత్యాలలో ఉన్న స్నేహితుడిని కలవాడిని వెలు తున్నాడు. ఈ క్రమంలో వెంకటాపూర్ శివారుకు చేరుకోగా జగిత్యాల నుంచి వస్తున్న కారు రశీద్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో రశీద్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన వ్యవసాయక్షేత్రం వైపు దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఆడెపు రాజు, గాజెంగి మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ, కోరుట్ల ఇన్‌చార్జి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. రశీద్ సోదరుడు షేక్ మజీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రశీద్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మానేయాలన్నందుకు మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మానేయాలని కూతురు మందలించినందుకు తల్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వేముల నర్సవ్వ (45) కొంత కాలంగా మద్యానికి బానిసైంది. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కూతురు పూజితను అడగడంతో ఆరోగ్యం క్షీణిస్తుందని, మద్యం మానేయాలని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నర్సవ్వ శనివారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సవ్వ తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కూతురు పూజిత, కొడుకు శేఖర్ చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. నర్సవ్వ భర్త రాజలింగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి రెండు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయంలో, మల్లన్న స్వామి ఆలయంలో హుండీలను పగలగొట్టి అందులోని డబ్బులను దొంగిలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూచిపూడిలో రాణిస్తున్న 'ఖని' కళాకారిణి


కూచిపూడి కళాకారిణి జ్యోతిర్మయి

కోల్‌సిటీటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన దగ్గుల జ్యోతిర్మయి కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. తనలాగే ఎంతో ఆసక్తి కలిగిన ఎంతో మందిని కూచిపూడి నృత్య కళాకారులుగా తీర్చిదిద్దుతున్నది. ఆమె భర్త ఆనంద్ సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా ఓసీపీ-5లో సింగరేణి ఉద్యోగి. జ్యోతిర్మయి మూడవ తరగతి చదువుతున్న సమయంలో తండ్రి రామస్వామి కూచిపూడి నృత్య అకాడమీ జక్క కృష్ణ వద్ద చేర్పించి శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లో ఏలేశ్వరపు విజయవల్లీప్రియ గురువు వద్ద కూచిపూడిలో డిప్లమా పూర్తి చేసింది. కూచిపూడి నాట్యప్రదర్శనలిస్తూ నాట్యజ్యోతిర్మయిగా పేరొందింది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో జ్యోతిర్మయి జాతీయ స్థాయిలో కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చిన పలు అవార్డులు



జ్యోతిర్మయికి అవార్డుతో పలువురి సత్కారం

పొందింది. ఆలయాల్లో నృత్యప్రదర్శనలతో నాట్యనీరాజనం ఇచ్చేందుకు జ్యోతిర్మయి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది.

● వైష్ణవి నాట్యస్థల్‌తో పలువురికి శిక్షణ..

కూచిపూడి నృత్యాన్ని ఇతరులకు నేర్పించాలనే సంకల్పంతో వైష్ణవి నాట్యస్థల్ కూచిపూడి నృత్య అకాడమీని జ్యోతిర్మయి 15 ఏళ్ల క్రితం ప్రారంభించింది. తన శిష్యులతో పలు ప్రదర్శనలు ఇచ్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకున్నానని, ఇది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని జ్యోతిర్మయి తెలిపింది.




కూచిపూడిలో శిక్షణ ఇస్తున్న జ్యోతిర్మయి

కారు అద్దాలు ధ్వంసం


పగిలిన కారు అద్దాలు

మల్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మల్యాల మాజీ ఎంపీపీ ఆగంతపు రవళీవంశీధర్‌కు చెందిన కారు అద్దాలను ఓ యువకుడు ధ్వంసం చేశాడు. శనివారం రాత్రి సదరు యువకుడు వంశీధర్‌తో పాటు అతని కుటుంబసభ్యులను దుర్భాషలాడుతూ ఇంటి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో అక్కడ గల కారు అద్దాలను ధ్వంసం చేశాడు. కాగా తమపై దాడికి యత్నించినట్లు అదే ప్రాంతానికి చెందిన యువకుడిపై వంశీధర్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

వీణవంక జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి


సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొండా దేవయ్య

వేములవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపులు ఐక్యతతో రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల మున్నూరు కాపు సంఘం కార్యాలయాన్ని ఆదివారం వేములవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ పరిధిలోని జిల్లాలకు చెందిన కార్యకలాపాల నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశంతో వేములవాడలో సంఘం కార్యాలయం ప్రారంభించామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 3000 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుకోవాలని కోరారు. రాష్ట్ర మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రజిత, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు రత్నాకర్, రాష్ట్ర యువత కార్యదర్శి నత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల పూజలు

ఓదెల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పూజలను ఘనంగా నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన నుంచి తరలివచ్చిన భక్తులంతా ఆలయంలో అర్చనలు, కోడి మొక్కులను సమర్పించారు. అలాగే మల్లన్నకు భక్తులు ఒగ్గుపూజారులతో పట్నాలు నిర్వహించారు.


ఓదెల మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

భూవివాదంతో దాడి..
ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో ఆదివారం ఇరు వర్గాల నడుమ నెలకొన్న భూవివాదం దాడి చేసుకునే వరకు చేరుకుంది. దాడి ఘటనలో మండల కేంద్రానికి చెందిన గడ్డం పుష్పలత, ఇద్దరు కొడుకులు కరుణాకర్, జగన్ తీవ్ర గాయాలపాలయ్యారు. దాడికి పాల్పడిన బండలింగంపల్లిలోని తండ్రీకొడుకులు బందుక శ్రీనివాస్, నరేశ్‌లపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రంలోని గడ్డం ఆనందం 2020లో బండలింగంపల్లికి చెందిన నర్సయ్య వద్ద 1.08 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. పొలం వద్దకు వెళ్లిన ఆనందం భార్య పుష్పలత, ఇద్దరు కొడుకులు కరుణాకర్, జగన్‌పై అదే గ్రామంలోని బందుక శ్రీనివాస్, అతని కొడుకు నరేశ్ ఆ భూమి తమదేనని అడ్డుకున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే గడ్డపారతో దాడికి దిగారు. పుష్పలత, కరుణాకర్, జగన్ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఆనందం ఫిర్యాదుతో శ్రీనివాస్, నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బోర్‌వెల్ వాహనం బోల్తా

మల్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని బల్వంతాపూర్ స్టేజీ సమీపంలో బోర్‌వెల్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. జగిత్యాల వైపు నుంచి వస్తున్న బోర్‌వెల్ వాహనం బల్వంతాపూర్ స్టేజీ సమీపంలో జాయింట్ రాడ్డు విరగడంతో అదుపుతప్పి రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో వాహనంలో గల ఒడిశాకు చెందిన సురేందర్, బీం, బాలారామ్, నిదేశ్‌లకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేసి పదవి విరమణ పొందిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి రాజయ్య కోరారు. పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఆదివారం హుజూరాబాద్ రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమావేశం ఎం రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 పేస్కేల్ బకాయిలు, వృద్ధాప్యంలో ఉన్న కార్మికులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఫ్రీగా అనుమతించాలన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే అందజేయాలని డిమాండ్ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు ఆర్ చారి, రాజయ్య, వి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి) వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజరాజేశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతి ప్రాతమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు తిరుపతిరావు, రాజేందర్, నర్సయ్య నరేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్న ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు


సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

● కొనసాగుతున్న ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్ జనవరి 19 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు లక్ష్మీనారాయణ భాగవతార్, ఉదయం 10గంటలకు వేదవతి భాగవతారి ఆధ్వర్యంలో హరికథ నిర్వహించారు. అపర్ణ భార్గవ కర్ణాటక గాత్రకచేరి, తిరుమల లత సంగీత కచేరి భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు దుర్గా మైత్రి నిర్వహించిన సోలో వీణ కచేరి, నాలుగున్నర గంటలకు హరికృష్ణ భార్గవి నిర్వహించిన సంగీత కచేరి అలరించాయి.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర


తాండ్ర్యాలలో పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తాండ్ర్యాలలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతరోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి కొండపైకి స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పండితులు మేడలాంబ కేతలాంబ సహిత మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించగా చుట్టు పక్కన గ్రామాలైన గంభీర్‌పూర్, పోసానిపేట, ఇప్పపల్లి, పోతారం గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జిల్లా పరిషత్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.


బీసీ జాతీయ సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్శరాం

వేములవాడ కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ జాతీయ సంక్షేమ సంఘం యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెడ్డవేణి పర్శరాంను నియమిస్తూ ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామకపు పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం నియామక పత్రాన్ని అందించినట్లు బీసీ జాతీయ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాం తెలిపారు. తన నియమకానికి సహకరించిన ప్రతీ ఒక్క బీసీ జాతీయ సంక్షేమ రాష్ట్ర జిల్లా మండల నాయకులకు రెడ్డవేణి పర్శరాం కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహనం అప్పగింత

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కొద్ది రోజులుగా ఉంటున్న టీఎస్02ఈక్యూ7104 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని యజమాని అందె కృష్ణకు ఆర్టీసీ అధికారులు ఆదివారం అందించారు. కొద్ది రోజులుగా బస్టాండ్ ఆవరణలో ద్విచక్ర వాహనాన్ని ఉండడాన్ని గమనించి భద్రత సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ భద్రత ఏటీఎం బి సురేష్ ద్విచక్ర వాహనాన్ని యజమానికి అందించారు. తన బైక్ ఇంటి ఎదుట పార్క్ ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లారని, నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నాడు. కార్యక్రమంలో బస్టాండ్‌భద్రత సిబ్బంది లక్పతి, ఏఎస్ఐ అజయ్‌కుమార్, అంజయ్య, పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాల బాలికల కబడ్డీ పోటీలు


విజయం సాధించిన కరీంనగర్ బాలికల జట్టు

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో సౌత్‌జోన్ బాల బాలికల అండర్-16 కబడ్డీ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. బాలికల విభాగంలో హుజూరాబాద్ జట్టుపై కరీంనగర్ జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో కరీంనగర్ జట్టుపై హుజూరాబాద్ జట్టు ఫైనల్లో విజయం సాధించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక బహుమతులు ప్రదానం చేశారు. అలాగే క్రీడాకారులకు వర్థినేని రవీందర్ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్‌రెడ్డి, రమేష్, రవీందర్, తిరుమల్‌రెడ్డి, ముత్యంరాజు, టి శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

ఆశలు అడియాశలు

- నెరవేరని పరిశ్రమల ఏర్పాటు హామీ
- అందుబాటులో 600 ఎకరాల ప్రభుత్వ భూమి


గంభీర్‌పూర్‌లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, గొర్రెల పెంపకం, సైనిక్ స్కూల్, లెదర్ పార్క్ వంటి పరిశ్రమలు గంభీర్‌పూర్‌కు వస్తాయని గంపెడాశలు పెట్టుకున్నా కల నెరవేరలేదు. గత బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలు వస్తాయంటూ నేతలు ఇచ్చిన హామీలతో స్థానికులు ఎంతో సంబరపడ్డా నిరాశే ఎదురైంది. గ్రామ శివారులో గుట్టల ప్రాంతంలో సుమారు 600 ఎకరాలు మేర ప్రభుత్వ భూములు ఉండడంతో ఇక్కడ పరిశ్రమలకు అనువైన ప్రాంతమని నిర్ణయించారు.

● గంభీర్‌పూర్ శివారులో..

గంభీర్‌పూర్ శివారులో 570, 571 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదికలతో పరిశ్రమల స్థాపనకు అనువుగా ఉంటుందనే భావనకు వచ్చారు. 2014లో తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ సర్కారు కొలువు దీరగా హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సంబంధిత శాఖ అధికారులు హడావుడి చేశారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్‌కు మంజూరు చేయడంతో నిరాశకు గురయ్యారు. తదనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటును పరిశీలించి రెవెన్యూ అధికారులతో సర్వేలు పూర్తి చేయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఫలితం కనిపించలేదు. గొర్రెల పెంపకం, లెదర్ పార్క్, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి పలు మార్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. పరిశ్రమలు ఏర్పడితే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

● నాలుగు మండలాలతో..

బీమారం, కొడిమ్యాల, రుద్రంగి, చందుర్తి మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాకు అనుసంధానంగా ఉండడంతో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల మెరుగుకు ఎంతో అనుకూలంగా ఉంది. గత సర్కారు విస్మరించిన నేపథ్యంలో కొత్త సర్కారు గంభీర్‌పూర్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తుందని కోటి ఆశలు పెట్టుకున్నారు

అనుమతి లేని లేఅవుట్‌లో హద్దు రాళ్ల తొలగింపు

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని అక్రమ లేఅవుట్లపై ఆదివారం పంచాయతీ అధికారులు కొరడా ఝళిపించారు. నగునూర్‌లోని సర్వే నంబర్ 453, 454లోని రెండెకరాల విస్తీర్ణంలో పంచాయతీ, సుడా అనుమతి లేకుండానే లే అవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు చేయడంతో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది హద్దు రాళ్లను తొలగించారు.

షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తాం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునఃప్రారంభిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరాభవన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన కోటి యాభై లక్షల విలువల గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి కింద లబ్ధిదారులకు ఆసుపత్రుల్లో అయిన ఖర్చులో 25-30 శాతం అందిస్తోందన్నారు. ప్రజలు ముఖ్యంగా ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్న ఆసుపత్రుల్లో వైద్యసేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ కింద రాష్ట్ర ప్రభుత్వం 10లక్షల రూపాయల వరకు వైద్య ఖర్చులు అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వం కన్నా మిన్నగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రుణమాఫీ అంశాన్ని బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టలేదని, బీజేపీకి రుణమాఫీపై సోయిలేదన్నారు. దేశంలో రైతులకు రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వమే అన్ని రాష్ట్రాల రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్‌పై పేటెంట్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, గత ప్రస్తుత ప్రభుత్వాలు ఆ విధానాన్ని కొనసాగింపు చేస్తున్నాయన్నారు. జనవరి 26 నుంచి రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా, వ్యవసా య కూలీలకు రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు కట్టించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, అనర్హులకు ఒత్తిళ్లకు తలొగ్గి ఇళ్ల మంజూరుకు అవకాశం ఇస్తే చట్టప్రకారం చర్యలుంటాయ న్నారు. పసుపు బోర్డు ప్రకటన శుభపరిణామమని, పసుపు బోర్డు ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. సమావేశంలో నాయకులు బండ శంకర్, తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, పిప్పిరి అనిత, జున్ను రాజేందర్, రాధాకిషన్‌రావు, దుర్గయ్య, బారి, కమాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మీ టికెట్'తో చూసొద్దామా..



- ఆలయాలు, పర్యాటక ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆలయ దర్శనాలు, విహార యాత్రల విశేషాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీ టికెట్ పేరుతో ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో రాష్ట్రంలోని 15 ఆలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్, జంతు ప్రదర్శన శాలలు, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్‌కు సంబంధించిన వివరాలు పొందుపరిచారు. స్మార్ట్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత ప్రవేశ టికెట్లు పొందవచ్చు. ఇటీవల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. మరిన్ని ప్రధాన ఆలయాలు, పర్యాటక ప్రాంతాల వివరాలు ఈ యాప్‌లో పొందుపరచాల్సి ఉంది.

● ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, ప్రాంతాల వివరాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం, రాజన్న సిరిసిల్ల జిల్లా అర్బన్ ఫారెస్ట్, కరీంనగర్‌లోని ఎల్ఎండీ, పెద్దపల్లిలో బోటింగ్‌కు సంబంధించిన వివరాలు యాప్‌లో ఉంటాయి.

● డౌన్‌లోడ్ ఇలా చేసుకోవాలి

తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరి వారు రూపొందించిన 'మీ టికెట్' యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అకౌంట్‌లో పిన్ నంబరు జనరేట్ చేసుకోవాలి. మన ఫోన్‌కు ఓటీపీ నంబరు వచ్చాక దాన్ని నమోదు చేయాలి. అనంతరం ఫోన్ నంబరు, పిన్ నంబరు ఎంటర్ చేసి లాగిన్ అయితే అందులో అన్ని వివరాలు తెలుస్తాయి.





వేములవాడ

గర్భాలయ దర్శనం	రూ. 1000
శీఘ్ర దర్శనం	రూ. 100
కోడె కట్టడానికి	రూ. 200

సేవలకు వేర్వేరుగా రుసుములు చెల్లించాల్సి ఉటుంది.



కొండగట్టు

గర్భాలయ దర్శనం	రూ. 400
అతి శీఘ్ర దర్శనం	రూ. 300
శీఘ్ర దర్శనం	రూ. 100



ఎల్ఎండీ, పెద్దపల్లిలో బోటింగ్

పిల్లలకు	రూ. 30
పెద్దలకు	రూ. 50
స్పీడ్ బోటుకు నలుగురికి	రూ. 350



సిరిసిల్లలోని అర్బన్ ఫారెస్ట్ పార్క్

కెమెరా	రూ. 300,
టూ వీలర్స్ పార్కింగ్	రూ. 10
బస్సు, వ్యానుకు	రూ. 50
ప్రవేశ రుసుము:	
పిల్లలకు	రూ. 10
పెద్దలకు	రూ. 30

● యాప్‌లో ఇంకా చేర్చాల్సినవి..

ధర్మపురి ఆలయ వివరాలు.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఉజ్వల, జింకల పార్క్ విశేషాలు, జిల్లా కేంద్రంలోని ప్రాచీన శైవ, వైష్ణవ క్షేత్రాల వివరాలు పొందపర్చలేదు. ఎలగందుల, మొలంగూరు, బొమ్మలమ్మగుట్ట, నగునూరు, ధూలికట్ట వంటి చారిత్రక ప్రదేశాల వివరాలను కూడా పొందుపరిస్తే ఉమ్మడి జిల్లా వాసులు ఆయా ప్రాంతాలను యాప్ సాయంతో సందర్శించే అవకాశం ఉంటుంది.

వినోద భోజనంబులో 'ఖని' కళాకారుడి ప్రతిభ

కోల్‌సిటీటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో దర్శకుడు జంధ్యాల జయంతి సందర్భంగా నిర్వహించిన వినోద భోజనంబు కార్యక్రమంలో గోదావరిఖనికి చెందిన స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ప్రధానకార్యదర్శి చంద్రపాల్ ప్రతిభ కనపర్చారు. స్టాండప్ కామెడీతో నవ్వులు పూయించి ప్రశంసలందుకున్నారు. అందుకు గాను హాజరైన అతిథులు సినీదర్శకులు రేలంగి నరసింహారావు, దూరదర్శన్ ప్రయోక్త ఓలేటి పార్వతీశం చేతుల మీదుగా చంద్రపాల్‌కు జ్ఞాపికను అందజేసి అభినందించారు.



జ్ఞాపిక అందుకుంటున్న చంద్రపాల్

ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రంగంపల్లిలోగల పెద్దపల్లి లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బారీ, ప్రధానకార్యదర్శి సోమిశెట్టి తిరుపతి, వైస్‌ప్రెసిడెంట్ అజయ్, జాయింట్ సెక్రెటరీ ఎండి జహంగీర్, కోశాధికారి ఎండి అఫ్జల్, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న లారీ డ్రైవర్లు

కన్నుల పండువగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని దసరా గుట్టపైన గల ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో స్వామి కల్యాణం కన్నుపండువగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో స్థాపిత దేవతల పూజ, ఉత్సవ మూర్తులను పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, పూజలు కార్యక్రమా ను బ్రహ్మశ్రీ గంగాప్రసాద్ దీక్షిత్ యాజ్ఞికంలో నంబి గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. స్వామి వారికి గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు పట్టు వస్త్రా లు సమర్పించగా అలంకరించారు. అనంతరం పురోహితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పురోహితులు రాజగౌతం, శితి కంఠ, షణ్ముఖశర్మ, నంబి మనోహర్‌శర్మ, నంబి రాజేందర్‌శర్మ, గ్రామ, ఆలయా భివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమతులు లేని సంఘాలతో క్రీడాకారులకు అన్యాయం

- హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ సంఘ సభ్యులు రమేష్, పుల్లయ్య, శంకర్ నారాయణ, లక్ష్మణ్

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు, నిబంధనల ప్రకారం లేని హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌తో క్రీడాకారులకు తీవ్రఅన్యాయం జరిగే అవకాశం ఉందని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు 52 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. అసోసియేషన్ పరిధిలో పనిచేస్తున్న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను, జిల్లాలోని అసోసియేషన్లు జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. 2021లో ఓ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని రాష్ట్రం, జిల్లాలో ఒలింపిక్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకులు లేకుండానే సంఘాలను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా సంఘాన్ని నడుపుతున్నట్లు ఆరోపించారు. ఈ సంఘం ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర పోటీలు లేకుండానే జాతీయ పోటీలు నిర్వహిస్తున్నారని, ఇలాంటి పోటీలతో క్రీడాకారులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సంఘం రాష్ట్రస్థాయిలో కీలకమైన పోస్టుల్లో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్న వ్యక్తి కోచ్‌గా వ్యవహరిస్తూ రాష్ట్ర, జాతీయ పోటీలకు రెఫరీగా వ్యవహరిస్తున్నాడని, ఈ విషయంపై స్పోర్ట్స్ అథారిటీ దృష్టి సారించాలని కోరారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్ మాట్లాడుతూ కరీంనగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తమ రాష్ట్ర అసోసియేషన్ అనుమతి ఉన్నట్లు చూపించి జిల్లాలో ఓ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేసి క్రీడాకారులను తప్పుదోవ పటిస్తున్నాడన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌పై రిజిస్ట్రార్, సీపీకి ఫిర్యాదు చేసి కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కె రమేష్, నల్గొండ కార్యదర్శి పుల్లయ్య, మహబూబ్‌నగర్ కార్యదర్శి శంకర్ నాయక్ పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్‌గా రషీద్



మహ్మద్ రషీద్

కరీంనగర్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా మహ్మద్ రషీద్‌కు పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ యాస్మిన్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు పదోన్న తి కల్పించారు. 1985లో దినసరి కూలీగా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో నాలుగేళ్ళు పనిచేసిన ఆయన స్కేల్ పోస్టు ఆపరేటర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇక ఆ తర్వాత సెరికల్చర్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది హన్మకొండ జిల్లాలో పనిచేసిన రషీద్ హుజురాబాద్ డివిజన్ సెరికల్చర్ అధికారిగా, కరీంనగర్ జిల్లా అధికారిగా కొనసాగుతున్నారు. పదోన్నతి కల్పించడంపై రషీద్ సంతోషం వ్యక్తం చేశారు.

ఐక్య పోరాటాల ద్వారానే కనీస వేతనం



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ఐక్య పోరాటాల ద్వారానే కనీస వేతనం, మద్దతు ధరలు సాధించుకోవచ్చని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక, కర్షక మైత్రి దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 జనవరి 19న సాధారణ సమ్మె సాధించిన గొప్ప విజయం కార్మికుల, కర్షకుల ఐక్యత అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ సాధారణ సమ్మెకు ముందే తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వం వేలాది మందిని అరెస్టు చేసి జైలులో వేసిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల రాజు మాట్లాడుతూ వ్యవసాయకార్మికులు, పేద రైతులే కాక గ్రామాల్లో ఉన్న వృత్తి దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాయికంటి శ్రీనివాస్, కాంపల్లి పోచయ్య, రాజమణి, కప్పంపల్లి రవి పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

- ఆర్ఐలు కుమారస్వామి, మోడం సురేష్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్ఐలు కె కుమారస్వామి, మోడెం సురేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆనందం, ఆరోగ్యం పెంపొందుతాయని ఆర్ఐ ఆఫ్ పోలీస్ కె కుమారస్వామి, మోడం సురేష్ అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో రెండో రోజు తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో వ్యాయామం, క్రీడలు తప్పనిసరి అని సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను అభినందించారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని, ఓడినవారు వచ్చే సంవత్సరం గెలుపునకు ప్రయత్నించాలన్నారు. క్రీడాకారులు అందరు కూడా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. మరో అతిథి జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడలు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు మంచి ప్రతిభచాటి చాంపియన్‌షిప్ సాధించాలన్నారు. కార్యక్రమలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, పోటీల పరిశీలకులు దీపక్ ప్రసాద్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, కోశాధికారి కనకయ్య, సంఘ రాష్ట్ర బోర్డు కన్వీనర్ ఇంద్రసేనా రెడ్డి, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు మల్లేష్, శ్రీనివాస్, రాజశేఖర్, జయంత్, అమర్, శివాజీ, సాయి,తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

● ఫైనల్స్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు..

తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల ఫైనల్స్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు చేరాయి. ఆదివారం సాయంత్రం జరిగిన సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 23-21 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు ప్రవేశించింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు 28-15 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. సోమవారం ఉదయం ఫైనల్స్ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. కాగా మూడు, నాలుగు స్థానాల కోసం మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతు సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొగిలి కిరణ్‌యాదవ్



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ముత్తారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొగిలి కిరణ్ యాదవ్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ నియామక పత్రాలను హైదరాబాదులోని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మొగిలి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ పూర్వ వ్యవసాయసాగులో ఎలాంటి పద్ధతులు పాటించారో రైతులకు తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు నకిలీ విత్తనాల విక్రయాలు, అత్యధిక ధరలకు ఎరువు విక్రయాలను ఉపేక్షించబోమని తెలిపారు. కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా చిగురు విద్యాసాగర్‌ను నియమితులైనట్లు కిరణ్ యాదవ్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



వీర్నపల్లిలో పీహెచ్‌సీ ప్రైవేటు భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని బొప్పాపూర్, వీర్నపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న రైతు భరోసా సర్వే తీరును ఆదివారం పరిశీలించారు. లే- అవుట్ చేసిన భూములు, ఇతర నిర్మాణాలపై ఆరా తీశారు. వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా పథకం వర్తిస్తుందని. అందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదని అన్నారు. రేషన్ కార్డులను మంజూరు చేయాలని ప్రజలు విన్నవించడంతో స్పందించిన కలెక్టర్ త్వరలో పంపిణీ చేస్తామన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. వీర్నపల్లి మండల కేంద్రానికి మంజూరైన పీహెచ్‌సీ భవనానికి స్థానిక ప్రైవేటు భవనాన్ని పరిశీలించారు. మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామచంద్రం, వీర్నపల్లి ఇన్‌చార్జి మారుతిరెడ్డి, ఎంపీడీవో సత్తయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో వాజీద్, ఏవోలు కవిత, జయ ఉన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల, గోరంటాల గ్రామాల్లో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేను ఆదివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రైతు భరోసా పథకం సాగు చేసే రైతులందరికీ అందుతుందని స్పష్టం చేశారు. కొత్త రేషన్‌కార్డుల జారీ నిరంతరం ప్రక్రియ అన్నారు. అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని వెల్లడించారు. ఆర్డీవో వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ భూపతి, ఎంపీడీవో రాజేందర్, పంచాయతీ సెక్రెటరీ రూతు, ఏఈవో సందీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మోచి సామాజిక వర్గం అభివృద్ధికి కృషి



ఆది శ్రీనివాస్‌ను, ప్రతాప రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

వేములవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మోచి సామాజిక వర్గం ప్రజల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మోచి కుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం వేములవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మోచి కుల సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. కులవృత్తి మీద ఆధారపడి జీవించే మోచి కులస్తులకు జీవనోపాధికి కార్పొరేట్ స్థాయి వ్యాపారం ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోచి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా కొండ్లెపు ముత్యం, ప్రధాన కార్యదర్శిగా కొండ్లెపు సుధాకర్, ఉపాధ్యక్షులుగా రామచంద్రం, ఓటారికారి భూమేష్, కావల్ల భిక్షపతి, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా కొండ్లెపు సాయిలు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల అధికారులుగా విశ్రాంత జాయింట్ కలెక్టర్ గంగాధర్ కావలె, సురేష్ కావల్ల, బాలకృష్ణ వ్యవహరించారని, వివిధ జిల్లాల సంఘం అధ్యక్షులు కార్యక్రమంలో పాల్గొన్నారని సంఘ నాయకులు తెలిపారు.

ఆర్‌ఎంపీలకు గుర్తింపు ఇవ్వాలి



కోనరావుపేటలో మాట్లాడుతున్న గ్రామీణ వైద్యులు

కోనరావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనిచేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి తగిన గుర్తింపునివ్వాలని ఆర్‌ఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐదరి శ్రీనివాస్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆర్‌ఎంపీల సమస్యల మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తొమ్మిది నెలలు శిక్షణ ఇచ్చారని, గ్రామీణ వైద్యులను గుర్తించారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆర్‌ఎంపీలకు 2009 ఆక్ట్ ప్రకారం ఆరు నెలలు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందించాలని కోరారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీలపై అధికారులు దాడులు నిర్వహిస్తున్నారన్నారు. 70 సంవత్సరాలుగా ఆర్‌ఎంపీ వ్యవస్థ కొనసాగుతోందని, శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. ఇదివరకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాలను కొనసాగిస్తూ సర్టిఫికెట్లు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్షణ వైద్యసేవలకు, ప్రాథమిక చికిత్స చేస్తూ ఉపాధిని పొందుతున్నామని, అర్హత లేదంటూ తమపై దాడులు నిర్వహించడం తగదని అన్నారు. ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని, తమ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపెల్లి ప్రభాకర్, సీనియర్‌లు బాలరాజు, దేవానందం, సత్యం, రాములు, భాస్కర్ రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్, శంకర్, మల్లేశం ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

గంభీరావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని బరిగెల గూడెం కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన గ్యార పద్మ కుటుంబానికి మా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మల్లుగారి నర్సాగౌడ్ చేయూతనందించారు. ఆదివారం క్వింటాల్ బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ఆయన వెంట నాయకులు దేవరాజ్, శంకర్, బాలరాజు తదితరులు ఉన్నారు.

గంభీర్‌పూర్ ఉపాధ్యాయుడికి స్కాలర్‌షిప్

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న నల్ల సంజీవ్‌రెడ్డి వోడాఫోన్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. నిరంత వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, వినూత్న బోధనా పద్ధతులు, బోధనలో టెక్నాలజీ వినియోగానికి గాను ఈ కంపనీ ప్రతీ ఏటా స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. 2024 విద్యా సంవత్సరానికి గాను సంజీవ్‌రెడ్డిని ఎంపిక చేస్తూ రు 25 వేల నగదును అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్లాపూర్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిరావుపేట గల్ఫ్ సంఘం క్యాలెండర్ ఆదివారం దుబాయ్‌లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించినట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లుడుతూ గల్ఫ్ కార్మికుల ఏకతాటికి తీసుకరావడానికి గల్ఫ్ సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూపీసీ అధ్యక్షుడు గుండెల్లి నర్సింహా, బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు వంశీ గౌడ్, సామాజిక సేవకులు పాల్గొన్నారు.

గోసంగి సంఘం అధ్యక్షుడిగా పర్శరాం

మెట్‌పల్లి టౌన్, జనవరి19 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి గోసంగి సంఘం నూతన అధ్యక్షుడిగా మామిడిపల్లి పర్శరాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన పర్శరాంను సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జన్నారపు కనకయ్య, మొగిలి, రాజయ్య, బాలచంద్రం, అరుణ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎల్లారెడ్డి పేట(వీర్నపల్లి),జనవరి19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ పటిష్టతకు పాటు పడాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్పతినాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్పతి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడాలన్నారు. బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పని చేయాలన్నారు. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా నియమించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, మల్లికార్జున్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు నాగరాజు, మహేశ్, పీర్యానాయక్, శ్రీనివాస్‌నాయక్, లింబాద్రి, వెంకట్, రాజేశ్, విష్ణు, రవి, రఘుపతి, తిరుపతి, వినాయక్, రంజిత్, మల్లయ్య, శేఖర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

ఎల్లారెడ్డిపేట, జనవరి19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని అర్హులైన వారందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులను అందజేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. పదేళ్లుగా అప్పటి ప్రభుత్వం నూతన రేషన్ కార్డులను అందించకపోవడంతో పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. మార్పులు, చేర్పులు చేయలేదన్నారు. పేదలను గుర్తించి ప్రతీ పేదకు రేషన్ కార్డు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేపడుతోందన్నారు. ఈ నెల 20 నుంచి 24 వరకు గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయండి

కొడిమ్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లి విశ్వబ్రాహ్మణులు సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ హూడార్ సింగిల్ విండో డైరెక్టర్ నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు కరీంనగర్‌లో సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. సంఘ భవనం లేకపోవడంతో తాము ప్రతీ నెల ఇబ్బందులు ఎదుర్కొంటు సమావేశాలు నిర్వ హించుకుంటున్నట్లు తెలిపారు. సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

వేములవాడ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం జడ్పీహెచ్ఎస్‌లో 2001-02 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత ఒక చోట చేరిన విద్యార్థులు చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు భాస్కర్, చొక్కయ, నారాయణరెడ్డి, శ్రీధర్, ఉమాదేవి, దేవయ్యను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రామిడి మంగ, చిట్టిరెడ్డి కళ్యాణి, ఆడెపు వాణి, ముగిలే సుజాత, అమరగొండ కిషన్, పర్శరాం, తిరుపతి, డాక్టర్ శ్రీధర్, అంజనేయులు, అశోక్, నరేష్, సమ్మయ్య, మస్తాన్, రాజశ్రీను, పద్మ, కవిత, రజిత, సుమలత, సునీత, జమీల, సుమలత, మమత, మాధవి, మహేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ పట్టా భూములకు రైతు బంధు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

తంగళ్లపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా పట్టా చేసుకున్న భూములకు రైతు బంధు పొందారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆరోపించారు. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలో అక్రమంగా పట్టాలు పొందిన భూమిని స్థానిక రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ పట్టాల మంజూరు వెనుక సూత్రధారి కేటీఆర్ అయితే, అప్పటి కలెక్టర్ పాత్రదారి అని విమర్శించారు. దేశాయిపల్లె శివారులోని 338 సర్వే నంబరులో 150 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందన్నారు. 550 ఎకరాల ప్రభుత్వ భూమిలో 220 ఎకరాల భూమి అటవీ శాఖకు కేటాయించారని, 60 ఎకరాలు రైతులు సాగు చేసుకుంటున్నారని, మిగులు భూమి అన్యాక్రాంతమైందని అన్నారు. చాలా సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు లేవని, కేటీఆర్ అనుయాయులకు వందల ఎకరాలు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు భైరనేని రాము, శ్రీకాంత్ గౌడ్, జూపెల్లి రాజేశ్వరరావు, రాజు, మీరాల శ్రీనివాస్ యాదవ్, ఇట్టి రెడ్డి శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్ గౌడ్, భరత్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

మెట్‌పల్లి టౌన్, జనవరి19 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వరావు అన్నారు. ఘనతంత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

రాయికల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని మార్కండేయ దేవాలయ ఆవరణలో ఆదివారం పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన జక్కుల చంద్రశేఖర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, యువజన సంఘం అధ్యక్షుడు సామల సతీష్, కార్యదర్శులు మామిడాల లక్ష్మీనారాయణ, ఆడెపు రాజీవ్, మ్యాకల రమేష్, శ్రీరాముల సత్యనారాయణ, కోశాధికారి చిలివేరి నర్సయ్య, ఉపాధ్యక్షుడు సింగని సతీష్, కార్యదర్శి అనుమల్ల చంద్రతేజ, ప్రెస్ క్లబ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, హనుమాన్ దేవాలయ చైర్మన్ దాసరి గంగాధర్, సలహాదారులు సామల్ల గోపాల్, ఆడెపు నర్సయ్య, పోపా అధ్యక్షుడు ఎలిగేటి రాజా కిషోర్, కార్యదర్శి గుట్ట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి



కోనరావుపేటలో మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ/కోనరావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాల ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి, పాల్గొన్నారు.

● వేములవాడ పట్టణంలో టౌన్ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని అన్నారు. మద్యం తాగి, ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని, ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సైలు రమేష్, ప్రేమానందం, ట్రాఫిక్ ఎస్సై రాజు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచుకుంటే సురక్షిత ప్రయాణంతో కుటుంబాలు ఆనందంగా ఉంటాయని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. ఎస్సైలు రమాకాంత్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



వేములవాడలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఇల్లంతకుంట: ఇల్లంతకుంటలో ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఎర్రం గంగనర్సయ్య, తర్రె లింగం, మాడిశెట్టి అభిలాష్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

చేసే లక్ష్యం నిర్దేశించారు. ఇందులో రూ.50.03 లక్షల బకాయిలు ఉన్నాయి. వీటిపై రూ.20.42 లక్షల జరిమానా ఉంది. ఇప్పటి వరకు రూ.2.44 కోట్లు వసూలు చేశారు. ఇందులో పాత బకాయిలు రూ.11.43 లక్షలు ఉన్నాయి. ఇంకా రూ.1.64 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 59.62 శాతం వసూలు చేశారు.

వసూళ్లపై పాలకవర్గాల ప్రభావం

సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలు రాష్ట్ర స్థాయిలో ముందు వరుసలో నిలవడంలో పాలకవర్గాలు కీలక పాత్ర పోషించాయి. వార్డుల్లో పన్నుల వసూళ్ల వంద శాతం పూర్తి చేసిన కౌన్సిలర్లను సన్మానించేవారు. కౌన్సిలర్ల ప్రమేయంతో రాష్ట్ర స్థాయిలో అవార్డులు వచ్చాయి. ఈనెల 26తో మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిసిపోనుంది. 27 నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. సిరిసిల్ల బల్దియాలో 39 వార్డులు, వేములవాడలో 28 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులోనూ వంద శాతం పన్నుల వసూళ్లలో కౌన్సిలర్ల పాత్ర కీలకంగా ఉన్న దశలో ప్రస్తుతం పాలకవర్గాల గడువు ముగిసిన తరువాత సిబ్బందికి సహకరించే వారు లేని పక్షంలో కొత్త సమస్యలు తలెత్తుతాయని భావిస్తున్నారు. అధికారులు కచ్చితత్వం పాటించడం ద్వారా ఇంటి పన్నులు చెల్లించే వారి మధ్య సమస్యలు తలెత్తుతాయని భావిస్తున్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి



సినీనటుడు కోటేశ్వర్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని, అప్పుడే సంస్థపై నమ్మకం ఏర్పడుతుందని ప్రముఖ సినీనటుడు ఎం.కోటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో సిరిసిల్లకు చెందిన తిరుమల ఎలక్ట్రానిక్స్ వారు నిర్వహించిన లక్కీడిప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బుల్లెట్‌తోపాటు వివిధ బహుమతులను వినియోగదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1987 నుంచి వ్యాపార రంగంలో వినియోగదారుల నమ్మకాన్ని చూరగొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఎలక్ట్రానిక్స్ యజమాన్యం పోకల సుమన్, లావణ్య, సుధాకర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటకం సత్తయ్య, వివిధ కంపెనీల మేనేజర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కోనరావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ఆదివారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించేలా కృషి చేయాలన్నారు. అనంతరం మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బాలాజీని సన్మానించారు. ఈ సమావేశంలో మాట్ల రమేష్, గాజ్యేల్ రాజు, ఎంపీటీసీ రేణుక, కుమ్మరి దిలీప్ కుమార్, లక్ష్మం నారాయణ, తిక్కల రాజు, వుల్కా ప్రశాంత్, సకినాల సుమీల్, ఇండ్ల శ్రీనివాస్, రాయిని మణిదీపక్, మొగిలిపాలెం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి



మల్కపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోనరావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలో బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య డిమాండ్ చేశారు. కోనరావుపేట మండలం మల్కపేటలో ఆదివారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిడ్జిల నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను తీసుకున్నారని ఆరోపించారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కెంద గంగాధర్, కాశి, వేణు, మంగళ శ్రీనివాస్, మిర్యాల ప్రభాకర్ రావు, కచ్చకాయల మహేష్, కొంటెల్లి నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి శిక్షణలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు



ప్రశంస పత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు అంజయ్య

చందుర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయుల శిక్షణలో చందుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మేడికాల అంజయ్య తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలపై ప్రదర్శన ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020)పై రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో డిసెంబరు 26 నుంచి జనవరి 15 వరకు ఉపాధ్యాయులకు జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా అంజయ్య సీసీఆర్టీ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ కుమార్ చేతులమీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అంజయ్య ఉత్తమ సేవలను గుర్తించి వోడాఫోన్ ఐడియా ఫౌండేషన్ జాతీయ స్థాయి పురస్కారం అందజేసింది. అంజయ్య జోగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అవునూరి ప్రభాకర్ మాదిగ డిమాండ్ చేశారు. మండల శాఖ అధ్యక్షుడు మంద రాజు అధ్యక్షతన మండలకేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగపై వ్యాఖ్యలు సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా వచ్చే నెల 7న హైదరాబాద్‌లో చేపట్టిన వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల మహాప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మాలమహానాడు జాతీయ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల అధ్యక్షుడు మంద రాజు, జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్, నాయకులు పసుల బాలరాజు, పట్నం మహేందర్, సావనపెల్లి శంకర్, బొడ్డు వెంకటేష్ పాల్గొన్నారు.